సాక్షి
వికారాబాద్

గురువారం । 9 । మార్చి । 2023



మూడేళ్లుగా నిరుపయోగం
పెద్దేముల్ మండలంలో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు మూలకు చేరాయి. 8లో▸



తెగుళ్లను నివారిద్దాం
వరి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. 8లో▸



మొక్కలు వాడిపోతున్నాయ్
పెద్దేముల్ మండలంలోని వననర్సరీల్లో మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణ కోసమే సంగ్రామయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న నాయకులు

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగల సంగ్రామ రెండో పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు సామాజిక న్యాయం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కాలయాపన చేయడం తగదన్నారు. బీజేపీ మొండివైఖరిని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంగ్రామయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాదయాత్ర ఆయా గ్రామాల్లో తిరుగుతూ ఏప్రిల్ 4న హైదరాబాద్ నగరాన్ని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, అంజి, భీములు, సాయిలు, మల్కప్ప, కృష్ణ, గోపాల్ తదితరులున్నారు.

మహిళా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



పలు రంగాలకు చెందిన మహిళలకు సన్మానం

తాండూరు టౌన్ : మహిళా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలు రంగాలకు చెందిన మహిళలను ఘనంగా సన్మానించారు. వికారాబాద్‌లో 11 ఏళ్లుగా తక్కువ ఫీజుతో అమ్మ మహిళా వసతి గృహాన్ని నడుపుతున్న వజ్రమణితో పాటు 500కి పైగా కాన్పులు చేసిన నర్సమ్మ, రత్నమ్మ, మాణెమ్మలకు సుష్మా స్వరాజ్ అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సాహు శ్రీలత మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మును నియమించి మహిళల పట్ల పార్టీకి ఉన్న గౌరవాన్ని చాటిందన్నారు. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి కేబినెట్‌లో ఒక్క మహిళను కూడా మంత్రిగా నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న హత్యాచారాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, పట్టణాధ్యక్షురాలు ఉమాదేవి, రేణుక, శృతి, హారతి, జయశ్రీ, జ్యోతిలతో పాటు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు మనోహర్‌రావు, మురళీకృష్ణ గౌడ్, పటేల్ విజయ్, పూజారి పాండు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. గొంతుకోసి

- ఇంటికి పిలిచి స్నేహితుడిపై హత్యాయత్నం
- తాండూరు మండలంలో ఘటన

తాండూరు రూరల్: సంచలనం సృష్టించిన అబ్దుల్లాపూర్‌మెట్ ఘటన మరవక ముందే మరో దారుణం చోటుచేసుకుంది. స్నేహితుడిని ఇంటికి పిలిపించి గొంతుకోశాడు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. తాండూరు మండలం చింతమణిపట్నంలో సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గురటి బలవంత్‌రెడ్డి, కుర్వ శ్రీశైలం స్నేహితులు. బలవంత్‌రెడ్డి వ్యవసాయం, శ్రీశైలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 6న మధ్యాహ్నం శ్రీశైలం తన స్నేహితుడు బలవంత్ రెడ్డికిఫోన్ చేసి అర్జెంట్‌గా రావాలని కోరాడు. స్నేహితుడు పిలుస్తున్నాడు కదా అని బలంత్‌రెడ్డి వెళ్లాడు. అతనితో మాట్లాడుతూనే శ్రీశైలం తన వద్ద ఉన్న చాకుతో బలవంత్‌రెడ్డి గొంతుకోశాడు. స్థానికులు గమనించి వెంటనే తాండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం శ్రీశైలం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. నిందితుడు శ్రీశైలంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే.. ఈ విషయం బయటకు రాకుండా పోలీసులు రెండు రోజులు గోప్యంగా ఉంచడం గమనార్హం.



వికారాబాద్‌లో జరిగిన వేడుకల్లో మహిళల ఆటాపాట..

జనయిత్రికి జేజేలు

- ఘనంగా మహిళా దినోత్సవం

అనంతగిరి: జిల్లాలో మహిళా దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలంతా ఒకచోటుకు చేరి ఆడిపాడారు. కేక్‌కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. వికారాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మొక్కలు నాటి, బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ మహిళా మూర్తికి సమాజం ఎపుడు రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ సబిత ఆనంద్, కౌన్సిలర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అలాగే వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు డీబీ శీతల్, శృతి దూత కోర్టు ఉద్యోగులతో కలిసి కేక్‌కట్ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, బార్ ప్రెసిడెంట్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తులు

జలం.. కలవరం

పాతాళానికి భూగర్భజలాలు

- నెల రోజుల్లోనే 3 మీటర్ల మేర పడిపోయిన వైనం

తాండూరు: వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. భానుడి ప్రతాపానికి రోజురోజుకు పాతాళానికి పడిపోతున్నాయి. పొలాల్లోని బోరుబావుల్లో నీరు రాని దుస్థితి నెలకొంది. మరోవైపు చెరువులు, బావులు, వాగుల్లో సైతం వేగంగా అడుగంటుతున్నాయి. ఈ వేసవి సీజన్‌లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రానున్న రోజుల్లో భూగర్భ జలాలు భారీగా పడిపోతాయని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గతేడాది అగస్టు నెలలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు మెరుగుపడ్డాయి. ఆ తర్వాత జలాలు పడిపోతుండటం గమనార్హం.

భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా 17 నుంచి 26వ తేదీ వరకు మండలాల్లో భూగర్భ జల మట్టాలను నమోదు చేస్తారు. జిల్లాలోని 73 భూగర్భ జల నమోదు కేంద్రాలు(సీజో మీటర్)ల నుంచి ఎంత మేర లోతులో ఉన్నాయనే వివరాలను పరిశీలించి రికార్డు చేశారు. ఫిబ్రవరి నెలలో భూగర్భ జలాల నమోదును విడుదల చేసింది. జిల్లాలో సగటున 11.16 మీటర్ల లోతులో భూగర్భ జలాల నీటిమట్టం ఉన్నట్లు జల వనరుల శాఖ అధికారులు ధ్రువీకరించారు. అయితే ఈ సారి ఉష్ణోగ్రతలు పెరిగితే 25 మీటర్ల నుంచి 30 మీటర్ల వరకు జలాలు పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వేసవి కాలంలో 35 మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలో 1,175 చెరువులు ఉండగా అందులో ఇప్పటికే 50 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. 100 ఎకరాల ఆయకట్టు ఉన్న 168 చెరువుల్లో 50 శాతం మాత్రమే నీటి నిల్వలున్నాయి. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, జుంటిపల్లి లక్నాపూర్ ప్రాజెక్టుల్లో 45 నుంచి 50 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు.



బోరుబావిలో భూగర్భ జలమట్టాలను నమోదు చేస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట్‌లో 8.82 మీటర్ల లోతులో..

మోమిన్‌పేట్ మండలంలో గతేడాది వర్షాకాలంలో 2.97 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో సేకరించిన నమోదులో 8.82 మీటర్లు, బంట్వారంలో 2.27 మీటర్ల నుంచి 7.85 మీటర్లకు తగ్గాయి. తాండూరులో 3.61మీటర్ల నుంచి 11.30 మీటర్లు, దౌల్తాబాద్ మండలంలో 4.6 మీటర్ల నుంచి 7.40 మీటర్ల వరకు భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి.

పొదుపుగా వాడుకోవాలి



వేసవిలో సహజంగా భూగర్భ జలాలు తగ్గిపోతుంటాయి. అయితే రైతులు బోరు బావుల నుంచి వచ్చే నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టాలి. అందుకోసం పొలాల్లో నీటి కుంటలు, ఫాంపాండ్స్, కందకాలలో నీటిని నిల్వ చేసుకోవడం మంచిది. వేసవి కారణంగా మరో రెండు మూడు నెలల పాటు భూగర్భ జలాలు పడిపోతాయి.

– దీప, భూగర్భజల వనరుల శాఖ అధికారి

వర్షాలు అధికంగా కురిసినా..

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో సాధారణం కంటే 68 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో 353 ఎంఎంల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సాధారణం కంటే అధికంగా 592.1 ఎంఎంల వర్షపాతం నమోదయ్యింది. అయితే భూగర్భ జలాలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించలేదు. దీంతో వేసవి సీజన్‌లో జిల్లాలో వేగంగా భూగర్భ జలాలు పడిపోయేందుకు కారణమవుతోందంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తమ సేవలకు అవార్డులు



మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: సమాజంలో పురుషులు, మహిళలు సమానమేనని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మహిళా అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన మహిళా అధికారులకు ఆయన ప్రశంస పత్రాలు, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పట్టణ మహిళలు, పారిశుధ్య కార్మిక మహిళలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ తప్పనిసరి

- నెల రోజుల్లో పనులు చేపట్టాలి
- గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తుప్పుపట్టిన, వంగిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలను నెల రోజుల్లో సరిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, జిల్లా పంచాయతీ అధికారి, విద్యుత్ శాఖ ఏఈలు, డీఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను శుక్రవారం లోపు ఓ నివేదిక తయారుచేసి ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా పశువులకు, మనుషులు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా వంద శాతం ఫెన్సింగ్ పనులు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏడు విడతల్లో హరితహారంలో నాటిన మొక్కలు ఆశించిన స్థాయిలో లేవని, ఈ సారి విద్యుత్ సబ్ సెంటర్లలో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు.

‘పాలమూరు’కు త్వరలో టెండర్లు

- రెండు నియోజకవర్గాలకు సాగునీరు
- డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తాం
- సొంత స్థలం ఉంటే రూ.3లక్షలు ఇస్తాం
- చంద్రకల్ దగ్గర ఫ్యాక్టరీ నిర్మాణం
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ : పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఏప్రిల్ నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి అవుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇన్నాళ్లు వివిధ కారణాల వల్ల ఆగిన పనులకు మోక్షం లభించిందన్నారు. కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కొడంగల్ రైతులకు ఎలాంటి సాగునీటి వనరులు లేవన్నారు. కేవలం చెరువులు, కుంటలపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కొడంగల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేసి ఇల్లు లేని నిరుపేదలకు మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వారికి సొంత స్థలం ఉంటే రూ.3లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి సహకరిస్తామన్నారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామ శివారులో ఫ్యాక్టరీ నిర్మాణానికి కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన అనుమతులు తదితర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్ మధుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు సిద్దిలింగప్ప, దాసప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే మహిళాభ్యున్నతి

మీర్‌పేట: మహిళా సాధికారత, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేటలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆడబిడ్డలు నీటి కోసం రోడ్డెక్కకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీరు సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. మహిళల భద్రత కోసం షీటీమ్‌లు ఏర్పాటు చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లక్ష రూపాయలు అందజేస్తున్నారని చెప్పారు. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవించే వరకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద పోషకాహారం, మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. ఆడబిడ్డ పుడితే రూ.13 వేల ఆర్థిక సాయంతో పాటు కేసీఆర్ కిట్ అందజేస్తున్నారని తెలిపారు. వ్యాపారం చేసుకోవాలనే మహిళల కోసం బీ– హబ్ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 40 ఏళ్లకు పార్కుకు మోక్షం
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- పాతబడిన పార్కుకు మరమ్మతులు

తాండూరు రూరల్: సుమారు 40 ఏళ్లకు పార్కు మరమ్మతులకు నోచుకుంటోంది. దీంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. కలెక్టర్ నారాయణరెడ్డి పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 4న ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం పాటలో పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఎంపీడీఓ పరిసర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గత 1972 సంవత్సరంలో సమితి బ్లాక్ ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన పార్కు శిథిలావస్థకు చేరింది. కంపచెట్లు మొలవడంతో దట్టమైన పొదలా మారింది. పరిశీలించిన కలెక్టర్ అక్కడే ఉన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో పార్కు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ చిన్నప్పల నాయుడు స్పందించి పాతబడిన పార్కుకు మరమ్మతులు చేయిస్తున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. బుధవారం కార్మికులతో ముళ్ల పొదలు, కంపచెట్లను తొలగించారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న పార్కులో పనులు చేయిస్తున్న అధికారులు

పన్ను భారం ఐదింతలు

- మున్సిపాలిటీల్లో ఆస్తి విలువ ఆధారంగా పన్నులు
- అయోమయంలో సామాన్యులు
- విలీన గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు

కొడంగల్ : కొత్తగా ఏర్పడిన కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో పన్నులు ఐదింతలు పెరిగాయి. దీంతో సామాన్యులకు భారంగా మారాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో మార్చి నెలలో మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు టార్గెట్ విధించడంతో ఉద్యోగులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విలీన గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని వాపోతున్నారు. కొడంగల్ మేజర్ గ్రామ పంచాయతీ 2018 ఆగస్టు 2న మున్సిపాలిటీగా అవతరించింది. మున్సిపల్‌లో అప్పటి గ్రామ పంచాయతీలైన కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలను విలీనం చేశారు. పట్టణాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశారు. సమీప గ్రామాలను విలీనం చేస్తూ మున్సిపాలిటీలుగా మార్చారు. గతంలో ఒక్కో ఇంటికి వందల్లో ఉన్న ఇంటి పన్ను ఇప్పుడు పేరు మారి ఆస్తి పన్ను అయింది. ఏడాదికి వేలల్లో వస్తోంది. మరొక విచిత్రం ఏంటంటే ఆస్తి పన్ను సకాలంలో కట్టకపోతే బ్యాంకు వడ్డీ కంటే అధికంగా జరిమానా విధిస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంది. ఎవరి ప్రమేయం లేకుండా కంప్యూటర్‌లో అధికంగా మారి ప్రజలకు మోయలేని భారం అవుతోంది. చిన్న గ్రామాల్లో ఇంటి పన్నును వేలల్లో చెల్లించాలంటే కష్టంగా మారింది. మున్సిపాలిటీలు ఏర్పడిన తర్వాత మూడేళ్ల వరకు గ్రామ పంచాయతీ లెక్కల ప్రకారం పన్ను వసూలు చేయాలని ప్రభుత్వం అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మూడేళ్ల గడువు ముగిసి రెండేళ్లయింది. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం పన్నులు వసూలు చేసేందుకు మున్సిపాలిటీ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కాలనీలు, గ్రామాలకు వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. కొడంగల్ మున్సిపల్‌లో కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలను.. పరిగి మున్సిపల్‌లో సుల్తాన్‌నగర్, ఎర్రగడ్డపల్లి, మల్లెవోనిగూడ, తుంకలగడ్డలను విలీనం చేశారు. విలీన గ్రామాలకు సంబంధించిన ఆస్తులను భువన్ యాప్‌లో నమోదు చేయడంతో ఆన్‌లైన్‌లోనే పన్నులు నిర్ణయిస్తున్నారు. ఆన్‌లైన్ ఆధారంగా గ్రామాల్లో పన్నులు దాదాపు ఐదింతలు పెరిగినట్లు ప్రజలు వాపోతున్నారు.



పన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

క్లుప్తంగా

డయాలసిస్ సెంటర్ ప్రారంభం



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ మూర్తి

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో బుధవారం డయాలసిస్ సెంటర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తం శుద్ధి చేయడానికి 5 యంత్రాలను బిగించినట్లు చెప్పారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉన్న వారికి డయాలసిస్ చేస్తామని తెలిపారు. ఆరోగ్య శ్రీ కార్డు లేనివారు సీఎంఆర్‌ఎఫ్ నుంచి లెటర్ తీసుకోవాలన్నారు. కిడ్నీ సమస్యలు ఉన్న రోగులకు వారానికి రెండు సార్లు రక్తం శుద్ధి చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని కిడ్నీ బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సాకేత్, డయాలసిస్ సెంటర్ నిర్వాహకులు, నర్సులు పాల్గొన్నారు.

కలప ట్రాక్టర్ పట్టివేత

కుల్కచర్ల: అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి పుట్టపహాడ్ గ్రామ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు కలపతో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుపడింది. కలప రవాణాకు సంబంధించి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్ భీమయ్యపై కేసు నమోదు చేసినట్లు కుల్కచర్ల ఎస్‌ఐ గిరి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

మోమిన్‌పేట: విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల విఠల్‌రెడ్డికి చెందిన రెండు పాడి గేదెలను మంగళవారం రాత్రి తన పశువుల పాకలో కట్టేశాడు. బుధవారం ఉదయం పాలు పితికేందుకు వెళ్లగా ఒక్కటే కనిపించింది. మరో దానికి కోసం పొలంలో వెతకగా విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద షాక్‌కు గురై చనిపోయింది. పాడి గేదె చనిపోవడంతో రూ. 60వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దోమ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. వికారాబాద్‌లోని రామయ్య గూడకు చెందిన బాలు తన బైక్‌పై కుల్కచర్ల నుంచి వికారాబాద్ వెళ్తున్నాడు. గొడుగోని పల్లి వద్ద స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో కింద పడ్డాడు. క్షతగాత్రుడిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువకుడి హల్‌చల్

చేవెళ్ల: తనకు చేవెళ్ల ఇంటి స్థలం ఇవ్వడం లేదని ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లోని పాత సిగ్నల్ టవర్ ఎక్కాడు. గ్రామస్తులు, పోలీసులు, సర్పంచ్ శైలజ యువకుడికి ప్లాటు ఇస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. దాదాపు రెండు గంటల పాటు యువకుడు హంగామా చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలం ధర్మసాగర్‌కు చెందిన సాలె విజయ్ కుమార్ నాలుగేళ్లుగా మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. టైలర్ దుకాణంలో పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. తనకు ఇళ్లు లేదని స్థలం ఇవ్వాలంటూ పోలీస్‌స్టేషన్‌లోని పాత సిగ్నల్ టవర్ ఎక్కాడు. స్థలం ఇస్తేనే కిందికి దిగుతానని మొండికేశాడు. సర్పంచ్ శైలజ, వార్డు సభ్యులు ప్లాట్ ఇస్తామని చెప్పడంతో కిందికి దిగాడు. అతనికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుండెపోటుతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

తాండూరు: గుండెపోటుతో తాండూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ నారా మహిపాల్‌రెడ్డి మరణించారు. పట్టణంలోని పాత తాండూరుకు చెందిన మహిపాల్‌రెడ్డి(50) కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. 2018లో టీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. మూడేళ్లుగా పార్టీలకు దూరంగా ఉంటున్నారు. మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్న మహిపాల్‌రెడ్డి మంచంపై నుంచి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మహిపాల్‌రెడ్డి ఆకాల మరణంపై నాయకులు సంతాపం ప్రకటించారు.

కష్టపడితే అన్నీ సాధ్యమే

అనంతగిరి: జీవితంలో లక్ష్య సాధనకు పేదరికం, కుటుంబ పరిస్థితులు అవరోధం కావని, అన్నింటినీ అధిగమించి లక్ష్యాన్ని ఛేదించాలని డీఎస్పీ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. బుధవారం వికారాబాద్‌లో వికాస్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ ఇంటర్ విద్య జీవితంలో చాలా ముఖ్యమైందన్నారు. మన దశ దిశ ఇక్కడి నుంచే నిర్దేశించుకోవాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా నిరుపయోగం

- ప్రారంభించిన నెల రోజులకే పని చేయని నీటి శుద్ధి యంత్రాలు
- మరమ్మతుల ఊసెత్తని అధికారులు



పెద్దేముల్ మండలంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం

పెద్దేముల్: లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు మూలకు చేరాయి. 2019లో ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్ యోజన ద్వారా మండలానికి 30కి పైగా నీటి శుద్ధి యంత్రాలు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ. 2.5లక్షలు ఖర్చు చేసి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేశారు. నాసిరక పరికరాల కారణంగా ప్రారంభించిన నెల రోజులకే అవి పాడయ్యాయి. దీంతో ప్రజా ధనం వృథా అయ్యింది. మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం రెండు గ్రామ పంచాయతీలు మినహా అన్ని గ్రామాల్లో నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశారు. యంత్రాలు ప్రారంభించిన నెలకే అవి మూలకు చేరాయి.

బాగుచేయాలి



గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలను వెంటనే బాగుచేయించాలి. రూ. 2.5 లక్షలతో ఏర్పాటు చేసిన యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని బాగు చేయించి పంచాయతీ పాలకవర్గానికి అప్పగించాలి. వేసవి ప్రారంభమైనందున వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– వెంకటరెడ్డి, రైతు, పెద్దేముల్

అధికారులు చొరవ చూపాలి



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రాలను మండల అధికారులు పర్యవేక్షించాలి. అవి ఎందుకు పని చేయడం లేదో తెలుసుకోవాలి. వాటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలి. ప్రజా ధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆ దిశగా చొరవ తీసుకోవాలి.

– శ్రీనివాస్, రైతు, దుగ్గాపూర్

వినియోగంలోకి తెస్తాం



గ్రామాల్లో ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్ యోజన ద్వారా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు ప్రజలను ఉపయోగపడేలా చూస్తాం. ఏయే గ్రామంలో యూనిట్లు పని చేస్తున్నాయి, ఎక్కడెక్కడ పని చేయడం లేదో గుర్తిస్తాం. పంచాయతీ కార్యదర్శులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని బాగు చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చూస్తాం.

– షేక్ సుష్మా, ఎంపీఓ, పెద్దేముల్

వరిలో తెగుళ్లను నివారిద్దాం

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



నస్కల్‌లో వరి పంటను పరిశీలిస్తున్న గోపాల్

పరిగి: వరి పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని, నివారణకు చర్యలు తీసుకుందామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని నస్కల్ గ్రామంలో రైతు వేదికను సందర్శించారు. ఏఈఓతో కలసి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేయాలన్నారు. వరి సాగులో తెగుళ్ల వస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వరి ఎండుముఖం పడుతున్న నేపథ్యంలో ఎకరానికి పొటాష్ 15 కిలోల చొప్పున చల్లాలన్నారు. జింక్, ఇనుము, ధాతువుల మిశ్రమం, ఫార్ములా 4.1 ను లీటర్ నీటిలో ఐదు గ్రాములు కలిపి ఎండు ముఖం పట్టిన వరిపై పిచికారీ చేయాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా




ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటామని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తామని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన అనుచరవర్గంతో అల్లాపూర్, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి పరిష్కరిస్తామని తెలిపారు.

సందిగ్ధంలో పత్తి రైతు



ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

- పది రోజుల క్రితం క్వింటాలు పత్తి రూ. 8,250
- ప్రస్తుతం రూ. 7,600

పెద్దేముల్: పత్తి ధర అంతుపట్టడం లేదు. పది నెల రోజుల క్రితం రూ. 8,200 నుంచి రూ. 8,250 వరకు పలికిన పత్తి ప్రస్తుతం రూ. 7,600లకు చేరడంతో అమ్మాలా.. వద్దా అన్న సందిగ్ధంలో రైతన్నలు పడుతున్నారు. గత ఏడాది రూ. 10వేల నుంచి రూ. 12వేల వరకు ధర దక్కడంతో రైతులు ఈ ఏడాది అదే ధర దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. కానీ ధర అంతుపట్టడం లేదు. రూ. 7600లకు మించే ప్రసక్తే లేదని వ్యాపారులు అంటున్నారు. అయినా రైతులు పత్తి విక్రయానికి సిద్ధంగా లేరు. ఇళ్లల్లోనే పంట దిగుబడిని నిల్వ చేశారు. ఇదిలా ఉండగా మిల్లులకు పత్తి రాక వెలవెలబోతున్నాయి. ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం నాలుగు నుంచి ఆరు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు వాపోతున్నారు. దిగుబడి, పంట సాగుకు అయిన ఖర్చులు రావాలంటే క్వింటాలు పత్తి రూ. 10వేల నుంచి రూ. 12వేల వరకు ధర పలికితేనే తమకు కాస్త లాభం ఉంటుందని రైతులు తెలిపారు.

తప్పులను ఎత్తి చూపకపోతే నష్టం

- విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి
- ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలి
- ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం గౌడ్

కొడంగల్: ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తి చూపకపోతే సమాజానికి నష్టం జరుగుతుందని ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు ముందుకు సాగడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలంటే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణిని తాము విమర్శిస్తున్నట్లు చెప్పారు. పీఆర్‌సీ ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కమిటీని కూడా ఇప్పటి వరకు నియమించలేదన్నారు. తెలంగాణ ఉద్యోగులకు నాలుగు డీఏలు రావాల్సి ఉందన్నారు. పదోన్నతులు, బదిలీలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న జీఓలు సరిగ్గా లేవన్నారు. ఎన్నికల తంతు కోసం ఉద్యోగులను మోసం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీ రావాల్సిన జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగుల అవసరాల కోసం తమ ఖాతాల్లో దాచుకున్న గ్రాడ్యుటీ డబ్బులను కూడా ప్రభుత్వం ఇతర అవసరాల కోసం వాడుకొని సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వంపై పోరాడే నాయకులను గెలిపిస్తే బడుగు బలహీన వర్గాలకు, ఉపాధ్యాయ ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎస్‌టీ యూటీఎస్ అధికారిక అభ్యర్థి భుజంగ్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు విష్ణుకుమార్, నాయకులు చంద్రకాంత్, రమేష్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత మృతి



శంకర్‌నాయక్ భౌతికాయం వద్ద డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు

- నివాళులర్పించిన మంత్రి సబితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మేయర్ పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాటోత్ శంకర్ నాయక్(55) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ బలోపేతానికి ఆయన అహర్నిశలు కృషి చేశారు. మంత్రి సబితారెడ్డికి విధేయుడుగా పనిచేశారు. ఆమె కాంగ్రెస్ వీడి టీఆర్‌ఎస్‌లో చేరినా శంకర్ నాయక్ కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఆయన మృతి పట్ల మంత్రి సబితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఎనుగు జంగారెడ్డి, మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి, నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ జెడ్పీటీసీ నేనావత్ ఈశ్వర్‌నాయక్, వైస్ ఎంపీపీ సునితా నాయక్, కేసీ తండా సర్పంచ్ మోతీలాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజునాయక్, కుమార్, జీ రామ్ నాయక్, వత్తుల నారాయణ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

పాపం పసివాళ్లు

- గుండెపోటుతో తల్లి మృతి
- ఐదేళ్ల క్రితం తండ్రి దుర్మరణం
- అనాథలైన ముగ్గురు పిల్లలు





జంగమ్మ (ఫైల్)

షాబాద్: గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. అంతారం గ్రామానికి చెందిన సిరిగిరి జంగమ్మ(32) బుధవారం ఉదయం ఛాతి నొప్పి వస్తోందని ఇంటి నుంచి బయటకు వచ్చి కుప్పకూలిపోయి మృతిచెందింది. ఐదేళ్ల క్రితం ఆమె భర్త అంజయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. భార్యభర్తలు చనిపోవడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. జంగమ్మ, అంజయ్య దంపతులకు ప్రశాంత్(13), శివ(06), లక్ష్మి(08)ఉన్నారు. వీరు ఉండటానికి ఇళ్లు కూడా లేదు. పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది. జంగమ్మ మృతితో పిల్లలు అనాథలుగా మారారు. వీరి చదువు, పోషణకు దాతలు ముందుకు రావాలని సర్పంచ్ యాదమ్మ, మాజీ సర్పంచ్ దర్శనాల బుచ్చయ్య, నాయకులు కృష్ణ తదితరులు కోరారు.

మహిళా సమాఖ్యకు స్త్రీనిధి అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న మమత

ధారూరు: మండల మహిళా సమాఖ్యకు స్త్రీనిధి అవార్డు వరించింది. బుధవారం కలెక్టర్ నారాయణ రెడ్డి అవార్డును ప్రదానం చేశారు. మండలంలో 2022–23 సంవత్సరానికి రూ. 89 లక్షల స్త్రీనిధి రుణాలు మంజూరు లక్ష్యం కాగా వివిధ బ్యాంకుల ద్వారా రూ. 1.73 కోట్లు పంపిణీ చేయించారు. లక్ష్యాన్ని అధిగమించడంతో పాటు ఏఎన్‌పీను 0 శాతానికి చేర్చడంలో మండల మహిళా సమాఖ్యకు జిల్లా స్థాయిలో ఈ అవార్డును ప్రకటించారు. బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి మండల సమాఖ్య అధ్యక్షురాలు మమతకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు నాగమణి, పండరీ, అశోక్, సిద్ధయ్య, సత్యయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలకు మెరుగు దిద్దుతానని బురిడీ

- మోసాన్ని పసిగట్టిన మహిళలు
- నిందితుడికి దేహశుద్ధి



నిందితుడు సుఖ్‌దేవ్ సింగ్

కద్లాల్: ఆభరణాలకు మెరుగులు దిద్దుతానని చెప్పి పలువురి మహిళలను బురిడీ కొట్టించిన వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మక్తమాధారం గ్రామంలో ఉదయం ఓ వ్యక్తి తిరుగుతూ ఆభరణాలకు మెరుగులు దిద్దుతానని మహిళలను నమ్మించాడు. అతని మాయ మాటలు నమ్మిన ముగ్గురు మహిళలు తమ ఆభరణాలు మెరిసేలా చేయాలని కోరారు. అలాగే వెండి గొలుసులను మెరుగు పెట్టాలని ఇచ్చారు. గ్రామానికి చెందిన ఓ మహిళ తన వద్ద ఉన్న 30 తులాల వెండి గొలుసును ఇచ్చింది. మెరుగు పెట్టిన తర్వాత తూకం వేస్తే 30 తులాల వెండి కాస్త 15 తులాలుగా ఉండడంతో అతన్ని నిలదీసింది. ఇలా ముగ్గురు మహిళలు మోసపోవడంతో ఒక్కసారిగా అనుమానం వచ్చి ఈ విషయం స్థానికులకు చెప్పారు. వారు నిందితున్ని పట్టుకొని నిలదీశారు. మహిళలను మోసం చేస్తావా అంటూ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. జేబులో లభించిన ఆధార్ కార్డ్ ఆధారంగా అతని పేరు సుఖ్‌దేవ్ సింగ్, బీహార్ రాష్ట్రం అని తెలిసింది. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ప్రజల సొమ్మును దోచిపెడుతున్న కేంద్రం

డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



బాలాపూర్ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు


మీర్‌పేట: ప్రజల సొమ్మును ప్రధానమంత్రి మోదీ వ్యాపార వేత్త అదానీకి కట్టబెడుతూ దేశాన్ని లూటీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ సంస్థల్లో ప్రజలు దాచిన లక్షలాది కోట్ల సొమ్మును కేంద్ర ప్రభుత్వం అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నష్టపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బాలాపూర్ ఎస్‌బీఐ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులను జాతీయం చేసి పేద ప్రజలకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో అదాని ప్రపంచ ఆదాయంలో 609వ స్థానంలో ఉండగా, బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలోనే 2వ స్థానంలోకి వచ్చారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అదానీకి లాభం చేకూర్చాలన్న ఆలోచన తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రధాని ఏనాడూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బ్యాంకులు, ఎయిర్ పోర్టులు, ఎల్‌ఐసీ, రైల్వే, ఐటీని, పోస్టాఫీసులను ప్రైవేటుపరం చేశారన్నారు. ఎల్‌ఐసీలోని 39 కోట్ల పాలసీదారులకు సంబంధించిన నగదును అదానీ కంపెనీలో పెట్టుబడి పెట్టడంతో రూ. 33,060 కోట్లు నష్టపోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఎస్‌బీఐ ఇతర బ్యాంకులకు అదానీ గ్రూప్ సుమారు 80వేల కోట్ల రుణాలు బకాయి పడిందన్నారు. సామాన్య ప్రజలు పది వేల రుణం చెల్లించకపోతే నానా ఇబ్బందులు పెడతారని, వేల కోట్ల రుణాలు బకాయిపడ్డ బడా వ్యాపార వేత్తలను మాత్రం వదిలేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల సొమ్మును కాజేసిన అదానీని అరెస్ట్ చేసి ఆస్తులను జాతీయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎల్మెటి అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, రాజ్‌కుమార్, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మనోహర్, బాలునాయక్, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో మహిళలకు రక్షణ

స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

షాద్‌నగర్: మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య అన్నారు. షాద్‌నగర్ పద్మావతి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటుగా ఆరోగ్య రక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. రెడ్ బెల్ట్ విభాగంలో అక్షిత, మమత, హరిప్రియ, సాయిదీప్తి ప్రతిభ కనబరిచారు. వారికి బెల్టులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.

పడాల రామారెడ్డి కన్నుమూత



రామారెడ్డి (ఫైల్)

శ్రీనగర్ కాలనీ: పడాల రామారెడ్డి కళాశాలల వ్యవస్థాపకుడు పడాల రామారెడ్డి (94) బుధవారం వయోభారంతో కన్నుమూశారు. పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించిన రామారెడ్డి న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నారు. 1988లో అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో మొట్ట మొదటి ప్రైవేట్ లా కళాశాలను పడాల రామారెడ్డి పేరిట నెలకొల్పారు. ఆయన హైకోర్టు లైబ్రేరియన్‌గా, జుడీషియల్ మేజిస్ట్రేట్‌గా కూడా పనిచేశారు. న్యాయశాస్త్రంపై ఉన్న పట్టుతో ఆయన సుమారు 120 లా పుస్తకాలను రచించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారెడ్డి భౌతికకాయాన్ని పంజగుట్ట ద్వారకాపురికాలనీలోని ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. రామారెడ్డి లా కళాశాలలో చదువుకున్న ఎందరో వ్యక్తులు న్యాయమూర్తులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.